వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ప్రారంభం



పనపాకం గ్రామంలో డ్రోన్ ద్వారా సేవలను తెలియజేస్తున్న అధికారులు

తిరుపతి అర్బన్: వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు జిల్లా గ్రామ పంచాయతీ అధికారి రాజశేఖర్‌రెడ్డి వెల్లడించారు. శనివారం జిల్లాలోని ఆరు మండలాల్లోని 12 పంచాయతీల్లో నిర్వహించినట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం అందించిన పథకాలను తెలియజేయడం, వాటిని సద్వినియోగం చేసుకోమని సూచించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశంగా పేర్కొన్నారు. శనివారం చంద్రగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాలోల సంకల్ప యాత్ర వాహనం ద్వారా వీడియోలను ప్రదర్శించి అవగాహన కల్పించామని వివరించారు. తిరుపతి రూరల్‌లోని తిరుమల నగర్, మంగళం, చంద్రగిరి మండలంలోని పనపాకం, కల్‌రోడ్ పల్లి, రామచంద్రాపురం మండలంలోని సొరకాయలపాళెం, దేసూరికండ్రిగ, పాకాల మండలంలోని దామలచెరువు,పెరసానిపసిలి, చిన్నగొట్టిగల్లు మండలంలోని చిట్టేచర్ల, దేవరకొండ, ఎర్రావారిపాళెం మండలంలోని ఎర్రమంద, ఉస్తికాయలపెంట గ్రామాల్లో యాత్ర కొనసాగించినట్లు వెల్లడించారు. ప్రతి రోజు 6 గ్రామాల చొప్పున ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని వెల్లడించారు.

పనపాకంలో వికసిత్ భారత్ యాత్ర

చంద్రగిరి: కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతో శనివారం మండల పరిధిలోని పనపాకం, కల్‌రోడ్డుపల్లి గ్రామంలో వికసిత్ భారత్ కార్యక్రమాన్ని జిల్లా పంచాయతీ అధికారి ఆదెం రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం వ్యాన్ ద్వారా ప్రధాని నరేంద్ర మోడీ సందేశాన్ని ప్రజలకు వివరించారు. పీఎం కిసాన్ సమ్మాన్ పథకం ద్వారా ఆర్గానిక్ ఎరువులతో శ్రేష్ఠమైన పంటలను పండించే పద్ధతులను ఆదర్శ రైతు దామోదర్ నాయుడు ప్రజలకు వివరించారు. అనంతరం అధికారులు ఆదర్శ రైతును సత్కరించారు. విద్యార్థులు ఆలపించిన దేశ భక్తి గీతాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ శ్రీ శశిరేఖ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రేపటి నుండి వికసిత్ భారత్ సంకల్ప యాత్ర



సమావేశంలో మాట్లాడుతున్న ఈవోపీఆర్‌డీ

భాకరాపేట: మండలంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర సోమవారం నుండి ప్రారంభం అవుతుందని చిన్నగొట్టిగల్లు మండల ఈవోపీఆర్‌డీ సోమశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం చిట్టేచెర్ల సచివాలయంలో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ యాత్ర ద్వారా భారత ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అందరికీ అర్థమయ్యే రీతిలో అవగాహన కల్పిస్తామన్నారు. విజయ గాథలు, ప్రకృతి వ్యవసాయం, భూములకు సంబంధించిన లక్షణాలు యాత్రలో వివరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మదనమోహనరాజు, సర్పంచ్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి



ఎంఈవోకు వినతి పత్రం అందజేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు

భాకరాపేట: విద్యా శాఖ–సర్వ శిక్షా అభియాన్ నందు ఒప్పంద కాంట్రాక్టు పద్ధతిన పనిచేయుచున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని చిన్నగొట్టిగల్లు మండల శాఖ ఉద్యోగులు ఎంఈవో సత్యనారాయణకు సమ్మె నోటీసు ఇచ్చారు. శనివారం ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ తమ సమస్యలను పరిష్కరించక పోతే డిసెంబర్ 15 తేదీ నుంచి 19 వరకు పెన్‌డౌన్, డిసెంబర్ 20 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎస్ కో–ఆర్డినేటర్ హేమంత్, కంప్యూటర్ ఆపరేటర్ రాధ, మెసెంజర్స్ స్టేట్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పాటూరు రవి, సీఆర్‌ఎమ్‌టీలు శ్రీరాములు, ప్రవీణ్, మధు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి అర్బన్: కలెక్టరేట్‌లోని అదనపు కమిషనర్, రీజనల్ ఆడిట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయంలో ఉద్యోగాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కార్యాలయ అధికారులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులు 07, ఆఫీస్ సబార్డినేట్ పోస్టులు 05 భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 24 నుంచి డిసెంబర్ 12వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. కలెక్టరేట్‌లోని ఏ బ్లాక్‌లో ఏడో అంతస్తులోని 710 కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. అదనపు సమాచారం కోసం తిరుపతి.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో చూసుకోవాలని తెలిపారు.

ఎన్‌ఎంఆర్ ఉద్యోగులు పోరాటానికి సిద్ధం కావాలి

తిరుపతి కల్చరల్: ఎస్వీ యూనివర్సిటీలో పని చేస్తున్న హాస్టల్, ఎన్‌ఎంఆర్ ఉద్యోగులు టైం స్కేల్ పోరాటానికి సిద్ధం కావాలని ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి ఎన్‌డీ.రవి, ఎన్‌ఎంఆర్ ఉద్యోగుల యూనియన్ గౌరవాధ్యక్షుడు విశ్వనాథ్ పిలుపునిచ్చారు. శనివారం ఎన్‌ఎంఆర్ ఉద్యోగుల యూనియన్ సమావేశం నిర్వహించారు. శ్రీకాళహస్తిలో డిసెంబర్ 17, 18, 19 తేదీల్లో మూడు రోజులపాటు జరుగనున్న ఏఐటీయూసీ జిల్లా ప్రథమ మహాసభలకు కార్మికులంతా హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఏఐటీయూసీ నేతలు కేవై. రాజా, చంద్రశేఖర్‌రెడ్డి, ఎన్‌ఎంఆర్ యూనియన్ నేతలు మోహన్‌రెడ్డి, సుధాకర్, రాజశేఖర్ పాల్గొన్నారు.

బాధ్యతగా ఓటు నమోదు చేసుకోవాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఆర్ఐఓ జీవీ ప్రభాకర్‌రెడ్డి

తిరుపతి ఎడ్యుకేషన్: ఓటు పొందడం ప్రతి పౌరునికి ప్రాథమిక హక్కు అని, 01–01–2024 నాటికి 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేయించుకోవాలని తిరుపతి జిల్లా ఇన్‌స్టిట్యూషనల్ నోడల్ ఆఫీసర్, ఆర్ఐఓ జీవీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. తిరుపతిలోని ఎస్వీడబ్ల్యూ, సీకాం, ఎస్‌డీహెచ్‌ఆర్ డిగ్రీ కళాశాలల్లో శనివారం ఓటు నమోదుపై విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు విధిగా ఓటు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు వారి సందేహాలను నివృత్తి చేశారు. ఎస్వీడబ్ల్యూ, సీకాం, ఎస్‌డీహెచ్‌ఆర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షలపై అవగాహన

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో పీజీ విద్యార్థులకు ప్లేస్‌మెంట్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో పోటీ పరీక్షలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ గిండీస్ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ డాక్టర్ సురేష్ కుమార్ ముఖ్యఅతిథిగా విచ్చేసి సివిల్స్, ఏపీపీఎస్సీ గ్రూప్స్, బ్యాంకు జాబ్స్ వంటి పోటీ పరీక్షలను సంబంధించి మెళకువలు తెలియజేశారు. ప్రిపరేషన్‌ను మొదలు పెట్టే విధానం, ప్రశ్నాపత్రాల సరళి వంటి విషయాలపై విద్యార్థినులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ కిశోరీ, అధ్యాపకులు విద్యార్థినులు, అకాడమీ సిబ్బంది మణి దీప్, మౌనిక, అంజలి పాల్గొన్నారు.

క్లుప్తంగా

సుజాతకు డాక్టరేట్ ప్రదానం


పాలూరు సుజాత

తిరుపతి సిటీ: ఎస్వీయూ కామర్స్ విభాగ పరిశోధక విద్యార్థిని పాలూరు సుజాత డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఆమె ప్రొఫెసర్ కె.జయచంద్రారెడ్డి పర్యవేక్షణలో కమర్షియల్ బ్యాంక్స్ అండ్ ఫామ్ క్రెడిట్ ఏ స్టడీ విత్ స్పెషల్ రెఫరెన్స్ టు కడప డిస్ట్రిక్ట్ ఆఫ్ ఏపీ అనే అంశంపై పరిశోధనా పత్రాలు సమర్పించారు.

సోమవారం ఐచ్ఛిక సెలవు మంజూరు


ఎంఈఓకు వినతి పత్రాన్ని సమర్పిస్తున్న ఉపాధ్యాయులు

పాకాల: 27వ తేదీన కార్తీక సోమవారం సందర్భంగా ఐచ్ఛిక సెలవు ప్రకటిస్తున్నట్లు ఎంఈఓ బాబ్జీ తెలిపారు. శనివారం మండలంలోని ఉపాధ్యాయులు సోమవారం ఐచ్ఛిక సెలవు కావాలని వినతి పత్రాన్ని సమర్పించారు. ఉపాధ్యాయుల విజ్ఞప్తి మేరకు సెలవును ప్రకటిస్తున్నట్లు ఎంఈఓ పేర్కొన్నారు. ఉపాధ్యాయులు జార్జ్, బాలసుబ్రమణ్యం, నాగరాజు, వెంకటస్వామి, పాల్గొన్నారు.

మాతమ్మ విగ్రహ తయారీకి రూ.50వేలు


ఆలయ నిర్వాహకులకు నగదు అందజేస్తున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

రామచంద్రాపురం: మండలంలోని గణేశ్వరపురం పంచాయతీ లక్ష్మీపురంలోని మాతమ్మ గుడిలో పంచలోహ విగ్రహాల తయారీకి శనివారం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి రూ.50వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికి, అమ్మవారి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆయన ఆలయంలో కొలువైన మాతమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు భానుకుమార్‌రెడ్డి, సిద్ధమునిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, రాజేష్, పురుషోత్తం నాయుడు, బాబు నాయుడు, భాస్కర్ నాయుడు, ఈశ్వర్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాహు-కేతు పూజలకు పోటెత్తిన భక్తులు


రాహుకేతు పూజా మండపాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ అంజూరు శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శని త్రయాదశి కావడతో రాహు-కేతు పూజలకు శ్రీకాళహస్తీశ్వరాలయానికి భక్తులు పోటెత్తారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా దేవస్థానం చర్యలు తీసుకుంది. పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో కేఎస్ రామారావు వేర్వేరుగా ఆకస్మిక తనిఖీలు చేశారు. ఆలయ పరిసరాలను పరిశీలించారు. పాలకమండలి చైర్మన్ రూ.500 రాహుకేతు పూజా మండపాన్ని తనిఖీ చేశారు. భక్తులకు ఇబ్బందిలేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. దళారీలపై నిఘా పెట్టాలని సూచించారు. అదే విధంగా కంచు గడప వద్ద భక్తులు ఇబ్బంది పడకుండా దర్శనానికి వెళ్లే విధంగా చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రదోష పూజలు


ప్రాకారోత్సవంలో పాల్గొన్న భక్తులు

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లి శ్రీపల్లి కొండేశ్వర స్వామి ఆలయంలో త్రయోదశి సందర్భంగా శనివారం ప్రదోష పూజలు వైభవంగా నిర్వహించారు. నందీశ్వరుడికి, శ్రీవాల్మీకేశ్వర స్వామికి ఏకకాలంలో అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించి దీపధూప నైవేద్యాలు సమర్పించారు. శివపార్వతుల ఉత్సవమూర్తులను సుందరంగా అలంకరించి ప్రాకారోత్సవం నిర్వహించారు. ఓం నమఃశివాయ నామస్మరణలు మిన్నంటాయి. ప్రదోష పూజలకు, దేవతమూర్తులకు పుష్పాలంకరణకు ఉభయ దాతగా శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్రసన్న రెడ్డి వ్యవహరించారు. ఆలయ చైర్మెన్ బాలాజీ రెడ్డి, కార్యనిర్వాహణ అధికారి కె.రామచంద్రారెడ్డి ఆయనకు స్వాగతం పలికి ఆలయ మర్యాదలు చేశారు. పాలక మండలి సభ్యులు కె.ఆనంద్, ఎస్ఎం సురేష్, ఎస్.మునివేలు, జి.మంజుల, ఎస్. మంజుల, ఉమాపతి పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు


ఉత్తరప్రదేశ్ మంత్రి రాజేందర్ శుక్లా


ఉంగుటూరు ఎమ్మెల్యే వాసు బాబు

తిరుమల: శ్రీవారిని శనివారం ఉత్తరప్రదేశ్ మంత్రి రాజేందర్ శుక్లా, ఎమ్మెల్యే వాసు బాబు దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. అధికారులు ఘనంగా లడ్డు ప్రసాదాలతో సత్కరించారు.

నేడు శ్రీవారిని దర్శించుకోనున్న కేంద్ర మంత్రి


కేంద్రమంత్రి షెకావత్‌కు స్వాగతం పలుకుతున్న టీటీడీ చైర్మన్ భూమన, ఈవో ధర్మారెడ్డి

తిరుమల: శ్రీవారిని కేంద్ర జల వనరుల శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ఆదివారం దర్శించుకోనున్నారు. ఈ సందర్భంగా శనివారం రాత్రి తిరుమలకు చేరుకున్న ఆయనకు టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈవో ధర్మారెడ్డి జీఎంఆర్ అతిథి గృహం వద్ద ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయనకు దర్శనం ఏర్పాట్లు చేయనున్నారు.

ఆత్యాధునిక వైద్య, శస్త్ర చికిత్సల ఆవిష్కరణ

- ప్రపంచ కిడ్నీ,క్యాన్సర్ సదస్సులో డాక్టర్ సిపాయి



ప్రపంచ కిడ్నీ, క్యాన్సర్ సదస్సులో పాల్గొన్న డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం

తిరుపతి కల్చరల్: కిడ్నీ, ప్రోస్టేట్ క్యాన్సర్లకు అత్యాధునిక వైద్య, శస్త్రచికిత్సలు అవిష్కరించబడడం శుభపరిణామమని ప్రముఖ యూరో లేజర్ సర్జన్ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం తెలిపారు. శుక్ర, శనివారం రెండు రోజుల పాటు కలకత్తాలో జరిగిన ప్రపంచ కిడ్నీ, క్యాన్సర్ సదస్సులో ఆయన పాల్గొని, ప్రసంగించారు. 50 సంవత్సరాలు దాటిన ప్రతి పురుషుడు ఏడాదికోసారి ఓ చిన్న రక్తపరీక్ష చేసుకోవాలని సూచించారు. ఆ చిన్న పరీక్షతోనే ప్రాథమిక దశలోనే ప్రోస్టేట్ క్యాన్సర్లు గుర్తించి చికిత్స తీసుకుంటే మరణాన్ని దరి చేరకుండా సంతోకరమైన జీవితాన్ని గడపడవచ్చని తెలిపారు. అలాగే మూత్రాశయ క్యాన్సర్ ప్రోస్టేట్ క్యాన్సర్ మొదలైన వాటిపై వచ్చిన ఆధునాతన ఆవిష్కరణల గురించి పలు దేశాల నుంచి విచ్చేసిన యూరాలజిస్టులు తమ పరిశోధనా పత్రాలను సమర్పించారు. దేశ విదేశాలకు చెందిన పలువురు యూరాలజిస్టులు ఈ సదస్సులో పాల్గొన్నారు.

ఎస్వీసీఈలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమం


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ముఖ్యఅతిథి పవన్, ప్రిన్సిపల్ సుధాకరరెడ్డి

తిరుపతి సిటీ: కరకంబాడి రోడ్డులోని ఎస్వీసీఈ కళాశాలలో అనంతపురం జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం శనివారం ప్రారంభమైంది. ఐదు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పలమనేరుకు చెందిన పవన్ ఎంపవర్ సొల్యూషన్స్ అధినేత డాక్టర్ పవన్ విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రసంగించారు. ప్రపంచవ్యాప్తంగా ఆటోమొబైల్స్ కంపెనీలు ప్రస్తుతం హైబ్రిడ్ వాహనాలపై పరిశోధనలు మొదలు పెట్టాయని తెలిపారు. ప్రస్తుతం ఉపయోగిస్తున్న శిలాజ ఇంధనాలు భూమిలోపల మరెంతో కాలం ఉండవని అందుకోసం సహజ వనరులపై శోధనలు తీవ్రస్థాయిలో జరుగుతున్నాయని తెలిపారు. డాక్టర్ ఎన్.సుధాకరరెడ్డి, ఎలక్ట్రికల్ విభాగాధిపతి డాక్టర్ వి లక్ష్మీదేవి, డాక్టర్ కుమార్, పెద్దసంఖ్యలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేడుకగా శ్రీకామాక్షి అమ్మవారి చండీ హోమం


శ్రీకామాక్షి అమ్మవారి చండీహోమం చేపడుతున్న అర్చకులు

తిరుపతి కల్చరల్: శ్రీకపిలేశ్వర స్వామివారి ఆలయంలో శ్రీకామాక్షి అమ్మవారి చండీహోమం శనివారం వేడుకగా నిర్వహించారు. కార్తీకమాసాన్ని పురస్కరించుకొని ఆలయంలో చేపడుతున్న నెల రోజుల విశేష పూజ, హోమ మహోత్సవాల్లో భాగంగా అమ్మవారి చండీ హోమం తొమ్మిది రోజుల పాటు సాగనుంది. చండీహోమంలో పాల్గొన్న భక్తులకు ఉత్తరీయం, రవికె, అన్నప్రసాదం అందజేశారు. ఒక రోజు హోమంలో పాల్గొన దలిచిన గృహస్తులు రూ.500 టికెట్‌తో పాల్గొనవచ్చని అర్చకులు తెలిపారు.

టూరిజం ఆర్డీ రమణ ప్రసాద్ పదవీకాలం పొడిగింపు


డాక్టర్ రమణప్రసాద్

తిరుపతి రూరల్: ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ రీజనల్ డైరెక్టర్, ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ తిరుపతి హబ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ రమణప్రసాద్ పదవీకాలం మరో ఏడాది పొడిగిస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్‌భార్గవ ఉత్తర్వులు జారీ చేశారు. తిరుపతి జిల్లా రామచంద్రాపురం ఎంపీడీఓగా పనిచేస్తున్న డాక్టర్ రమణప్రసాద్ గతేడాది టూరిజం శాఖ రీజనల్ డైరెక్టర్, ఏపీటీడీసీ ఈడీగా బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల ఆయన ఎంపీడీఓ నుంచి డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్(డీఎల్‌డీఓ)గా పదోన్నతి పొందారు. ఈ నేపథ్యంలో డీఎల్‌డీఓ హోదాలో ఆయనకు మరో ఏడాది పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తనపై నమ్మకం ఉంచి కీలకమైన ఈడీ, రీజనల్ డైరెక్టర్ పదవులకు మరో ఏడాది పొడిగింపు ఇచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి రోజాకు డాక్టర్ రమణప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా జాతీయ రాజ్యాంగ దినోత్సవం


టీటీడీ లా ఆఫీసర్ వై.వీర్రాజును సత్కరిస్తున్న ఎస్వీ ఆయుర్వేద కళాశాల ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: ఎస్వీ ఆయుర్వేద కళాశాలలో శనివారం జాతీయ రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీటీడీ లా అధికారి వై.వీర్రాజు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కళాశాలలోని విద్యార్థులు, వైద్యులు, ఇతర సిబ్బందికి రాజ్యాంగంలోని విషయాలపై అవగాహన కల్పించారు. ప్రస్తుత కాలంలో విద్యార్థులు అలవర్చుకోవాల్సిన నడవడిక గురించి తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రేణుదీక్షిత్ మాట్లాడుతూ రాజ్యాంగ దినోత్సవం ప్రాముఖ్యతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి డాక్టర్ వి.విజయభాస్కర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీనివాసకుమార్, ఎఫ్‌టీఎస్ డాక్టర్ రమేష్‌బాబు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్‌వీ.సుబ్బారెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ హరినాథాచారి, అధ్యాపకులు, విద్యార్థులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైవర్‌పై దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి


తిరుపతి సెంట్రల్ బస్టాండ్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్టీసీ ఈయూ నేతలు

తిరుపతి అర్బన్: ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ డిమాండ్ చేశారు. తిరుపతి డిపోకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ మురళిపై శుక్రవారం చిత్తూరు జిల్లా జీడీ నెల్లూరు మండలం పచ్చికాపలం వద్ద దాడి చేసిన విషయం తెలిసిందే. దానిని ఖండిస్తూ శనివారం తిరుపతి బస్టాండ్ వద్ద ఎంప్లాయిస్ అసోసియేషన్ నేతలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనవసరంగా డ్యూటీలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగిపై దాడి చేయడాన్ని తప్పుబట్టారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని పేర్కొన్నారు.


డ్వాక్రా మహిళలు, వెలుగు కార్యాలయ సిబ్బందితో ర్యాలీ

లింగ వివక్ష చూపడం నేరం

పాకాల: ప్రస్తుత సమాజంలో ఆడ, మగ ఇద్దరూ సమానమేనని, అత్యాధునిక సమాజంలో లింగ వివక్ష చూపడం నేరమని ఏపీఎం కోమలాదేవి తెలిపారు. శనివారం జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా జాతీయ కార్యక్రమంలో భాగంగా స్థానిక వెలుగు కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మహిళలతో జెండర్ ప్రతిజ్ఞ చేయించారు. వెంకటముని, మునిలక్ష్మి, సుబ్రమణ్యం, కవిత, రెడ్డెప్పరెడ్డి, షబానా, పి.సుజాత, కె.సుజాత పాల్గొన్నారు.

స్త్రీలపై వేధింపులు ఆగాలి

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన స్త్రీ హింస వ్యతిరేకదినం కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ మొహిద్దీన్‌బాషా మాట్లాడుతూ మహిళలపై వేధింపులు ఆగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మహిళా సమన్వయకర్త డాక్టర్ మాధవి, అధ్యాపకులు చిట్టి కళావతి, రమణమ్మ, విష్ణుప్రియ, లక్ష్మీప్రసన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

యువత, మహిళలకు నైపుణ్య శిక్షణ

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఎస్వీయే ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో శనివారం కోకోకోలా పరిశ్రమ భాగస్వామ్యంతో యువత, మహిళలకు నైపుణ్యాన్ని పెంపొందించే శిక్షణకు శ్రీకారంచుట్టారు. ఇందుకు పూణేకు చెందిన వై4డి స్వచ్ఛంద సంస్థతో కలిసి మూడు విభాగాల్లో మహిళలు, యువతకు శిక్షణ ఇస్తారు. డిజిటల్ లిటరసీ ఫర్ ఉమెన్, మార్కెటింగ్ అండ్ సేల్స్, క్లస్టర్ డెవలప్‌మెంట్ విభాగాల్లో శిక్షణ ఇస్తారు. ఈ శిక్షణ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో ఉంటుంది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీలత మాట్లాడుతూ విద్యార్థులు, మహిళలుఈ నైపుణ్య శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె పవిత్రారెడ్డి,కోకోకోలా పరిశ్రమ ప్రతినిధి శ్యామ్‌ప్రసాద్, వై4డి ప్రతినిధి సుయోగ్ కిర్వి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ మురళి, అధ్యాపకులు పాల్గొన్నారు.

పిల్లల మేధస్సు పెంపొందించే యాగం అబాకస్


విజేతలతో నిర్వాహకులు, ముఖ్య అతిథులు

తిరుపతి ఎడ్యుకేషన్: ఆర్.కె.అబాకస్‌లో శిక్షణ తీసుకునే ప్రతి విద్యార్థి భవిష్యత్ బాధ్యత తమదేనని, విలువలతో కూడిన శిక్షణ, పిల్లల మేధస్సు పెంపొందించే ఒక యాగం అబాకస్ అని ఆర్కే అబాకస్ చైర్మన్ ఆర్కేరెడ్డి తెలిపారు. ఆర్.కె.అబాకస్ సంస్థ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అబాకస్ పోటీలను నిర్వహించారు. శనివారం ఎంఆర్ పల్లి సర్కిల్లోని ఆర్కే అబాకస్ ప్రధాన శిక్షణా కేంద్రంలో విభాగాల వారీగా విజేతలను నిర్ణయించారు. విజేతలకు బహుమతి ప్రదానం చేసి, సర్టిఫికెట్లను అందజేశారు. నీషా, యశ్వంత్, జయదీప్, వశీకర్ కృష్ణ కుందన్ ప్రతీష్‌రెడ్డి, కుషాల్ సాత్విక్ రెడ్డి, సాల్మాన్, హర్షిత్ విజేతలుగా ఎంపికయ్యారు. ముఖ్య అతిథులుగా ఎస్వీ డిఫెన్స్ అకాడమి అధినేత జీవీ శేషారెడ్డి, భక్త మల్లారెడ్డి గ్లోబల్ ఫౌండేషన్ అధ్యక్షురాలు సుమతిరెడ్డి, విశ్వం గ్రూప్ ఆఫ్ స్కూల్ డైరెక్టర్ విశ్వచందన్‌రెడ్డిలు హాజరయ్యారు. బ్రిలియంట్ స్కూల్ కరస్పాండెంట్ ఓం ప్రకాష్‌రెడ్డి, ఎస్వీయూ సైకాలజీ ప్రొఫెసర్ హరిక్రిష్ణ, స్వామి వివేకానంద కన్యాకుమారి తెలుగు ప్రాంత సహ ప్రముఖులు మారుతీ మోహన్‌రెడ్డి, రమేష్, రఫీ, లక్కు ప్రేమానంద రెడ్డి, వినయశ్రీ, సంస్థ డైరెక్టర్ ఆర్కే విమలారెడ్డి పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి చేయూత

ఏర్పేడు: కందాడు ఎస్సీ కాలనీకి చెందిన బోనాసి భాస్కర్ కుటుంబానికి శనివారం వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి రూ.10 వేలు సాయం చేశారు. భాస్కర్(47) అయ్యప్ప మాల ధరించి శబరిమల వెళ్లి, గురువారం రాత్రి గుండెపోటుతో పంబ సమీపంలో మృతి చెందిన విషయం తెలిసిందే. మృతదేహం శబరిమల నుంచి శనివారం స్వగ్రామానికి చేరుకుంది. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సూచనల మేరకు కిషోర్ రెడ్డి గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులకు నగదును అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. సర్పంచ్ శ్రీదేవి, వీరారాఘవరెడ్డి, నాయకులు రాంబత్తెయ్య, పరంధామరెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.



స్మార్ట్ మంకీ

మీరు చూస్తున్న ఈ చిత్రంలో ఆ దివ్యాంగుడి వెంట ఉన్న కోతి .. మామూలు కోతి కాదండోయ్, స్పెషల్ కోతి అనే చెప్పాలి. మనతో సమానంగా స్మార్ట్ ఫోన్‌ను ఆపరేట్ చేస్తూ అబ్బురపరుస్తున్న ఈ కోతి తిరుచానూరు ఆలయ పరిసరాల్లో కనిపించింది. కేరళ అడవుల్లోని అరుదైన వానర జాతికి చెందిన ఈ కోతి పేరు మంగా. దివ్యాంగుడైన ఆ యాచకుడితో పాటే ఉంటుంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

హోరాహోరీగా కబడ్డీ పోటీలు

- ఫ్లడ్ లైట్ల వెలుగులో రాత్రంతా సాగిన వైనం
- నేటితో ముగియనున్న పోటీలు


పోటీల్లో తలపడిన చిత్తూరు - కడప బాలికల జట్లు



తలపడిన కృష్ణ- విజయనగరం జట్లు, పోటీ పడుతున్న వెస్ట్ గోదావరి- అనంతపురం జట్లు

చౌడేపల్లె: స్థానిక ఉన్నత పాఠశాల మైదానంలో రాష్ట్రస్థాయి అండర్ 17 అంతర్ జిల్లాల బాలబాలికల కబడ్డీ పోటీలు రెండవ రోజైన శనివారం హోరాహోరీగా సాగాయి. ఇందులో 13 ఉమ్మడి జిల్లాలకు చెందిన జట్లు పాల్గొన్నాయి. క్రీడలను వీక్షించడానికి వచ్చిన ప్రేక్షకులు, క్రీడాభిమానులతో ఉన్నత పాఠశాల క్రీడా మైదానం కిటకిటలాడింది. పోటీలు ఉదయం 9 నుంచి రాత్రి వరకు సాగాయి. జట్ల వివరాలను కబడ్డీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టి.రామచంద్ర వెల్లడించారు. బాలుర విభాగంలో కడప-కృష్ణ జిల్లాల జట్లు తలపడగా 46-46 పాయింట్లు సాధించాయి. తూర్పుగోదావరి జట్టు 44 పాయింట్లు సాధించగా అనంతపురం జట్టు 57 పాయింట్లతో విజయ కేతనం ఎగురవేసింది. అలాగే గుంటూరు - నెల్లూరు జట్లు మధ్య జరిగిన పోరులో రెండూ 50-50 పాయింట్లు సాధించాయి. విశాఖపట్టణం - కర్నూలు మధ్య జరిగిన పోటీల్లో కర్నూలు 23 సాధించగా 57 పాయింట్లతో విశాఖ విజయం సాధించింది. వెస్ట్ గోదావరి 48 పాయింట్లు సాధించగా ప్రకాశం జట్టు 50 పాయింట్లతో విజయ దుందుభి మోగించింది. విజయనగరం - కృష్ణ మధ్య జరిగిన పోరులో విజయగనరం 17 పాయింట్లు సాధించగా కృష్ణ 44 పాయింట్లతో విజయం కైవసం చేసుకుంది. శ్రీకాకుళం - అనంతపురం జట్లు తలపడగా అనంతపురం 29 పాయింట్లు, శ్రీకాకుళం 63 పాయింట్లతో విజయం సాధించింది. అలాగే కర్నూలు-నెల్లూరు జట్లు 22-48 పాయింట్లు కొనసాగించాయి. బాలికల విభాగంలో విశాఖపట్టణం - నెల్లూరు జట్లు 43-44తో హోరాహోరీగా తలపడ్డాయి. గుంటూరు- ఈస్ట్ గోదావరి 52-56 పాయింట్లు సాధించాయి. వెస్ట్ గోదావరి - ప్రకాశం 51-21 పాయింట్లు సాధించాయి. విజయనగరం - కృష్ణ జట్లు 42-37 పాయింట్లను సాధించాయి. చిత్తూరు - కడప జట్లు 58-8 పాయింట్లు, కర్నూలు - నెల్లూరు జట్లు 45-39, శ్రీకాకుళం - ఈస్ట్ గోదావరి జట్లు 51-11, కృష్ణ -ప్రకాశం జట్లు 22-40 పాయింట్లు, చిత్తూరు - అనంతపురం జట్లు 74-21 పాయింట్లతో విజయం సాధించాయి. ఈ పోటీల్లో విజయం సాధించిన క్రీడా జట్లు క్వార్టర్ ఫైనల్, సెమీస్ పోటీలకు సిద్ధం అయ్యాయి. పోటీలు ఫ్లడ్ లైట్ల వెలుగులో రాత్రి కూడా కొనసాగుతున్నాయి. ఫలితాలు వెల్లడి కావాల్సి ఉంది. ఆదివారం ఫైనల్ పోటీల్లో విజయం సాధించిన జట్లకు ట్రోఫీలు అందజేయనున్నారు. కార్యక్రమంలో విజయవాణి విద్యా సంస్థల అధినేత నాయుని చంద్రశేఖర్‌మూర్తి, పీడీలు వెంకటేష్, రెడ్డెమ్మ, నితిన్, అజయ్, రెడ్డి ప్రవీణ, మృదుల, అమరనాథ్, సురేష్‌బాబు, ఉమాదేవి పాల్గొన్నారు.

కల్యాణ వెంకన్న జల విహారం


తెప్పపై ఉభయ దేవేరులతో విహరిస్తున్న కల్యాణ వెంకన్న

నారాయణవనం: మండల కేంద్రంలో తిరుమల తిరుపతి దేవస్థానం అనుబంధంలోని ప్రసిద్ధ శ్రీ పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక తెప్పోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. నాలుగురోజు శనివారం సాయంత్రం పద్మసరస్సులో తెప్పపై శ్రీదేవి, భూదేవి సమేతంగా స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. వేకువజామున సుప్రభాత సేవతో నిత్యపూజా కైంకర్యాలను నిర్వహించారు. ఉదయం 9 గంటలకు ఉభయ దేవరులతో స్వామివారి ఉత్సవమూర్తులకు కల్యాణ మండపంలో ఏకాంతంగా స్నపన తిరుమంజనం చేపట్టారు. శనివారం కావడంతో ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం ఉత్సవమూర్తులను పట్టుపీతాంబరాలు, పరిమళభరిత పుష్పమాలికలు, విశేషాభరణాలతో అలంకరించి తిరుచ్చిపై కొలువుదీర్చారు. మేళతాళాలు, భక్తుల కోలాటాల నడుమ ఊరేగింపుగా పద్మసరస్సు వద్దకు వేంచేపు చేశారు. సరస్సులో జలాలకు సంప్రోక్షణ తదితర పూజలను నిర్వహించి విద్యుత్ దీపాలు, పచ్చటి మామిడి తోరణాలతో సుందరంగా అలంకరించిన తెప్పపై ఉత్సవర్లను అధిష్టింప చేశారు. సరస్సులో తెప్పపై ఐదు ప్రదక్షిణలు స్వామి,అమ్మవార్లు జల విహారం చేశారు. స్వామి,అమ్మవార్లను దర్శించి భక్తులు తరించారు. ఆలయానికి చేరుకున్న ఉత్సవర్లకు ఆస్థానం, ఏకాంత సేవ నిర్వహించారు. ఇన్‌చార్జి డిప్యూటీ ఈవో దేవేంద్రబాబు, ఏఈవో పార్థసారథి, ఆలయ అధికారి నాగరాజు, భద్రతా జమేదార్ రాజశేఖర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేడు శ్రీదేవి,భూదేవి సమేతంగా..

తెప్పోత్సవాలలో చివరి రోజు ఆదివారం శ్రీదేవి, భూదేవి సమేతంగా కల్యాణ వేంకటేశ్వరస్వామి తెప్పపై జల విహారం చేయనున్నారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులు పద్మసరస్సు గట్టుపై నేతి దీపాలను వెలిగించాలని, సరస్సు నీటిలో వదలకూడదని ఆలయ అధికారి నాగరాజు, ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్య విజ్ఞప్తి చేశారు.

క్లుప్తంగా

ఎండీయూల రాష్ట్ర ప్రధాన కార్యాలయం ప్రారంభం



రాష్ట్ర కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కేతం జయచంద్రారెడ్డి, వైఎస్ఆర్ సీపీ నేతలు

తిరుపతి కల్చరల్: కొర్లగుంటలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమైక్య ఎండీయూ ఆపరేటర్స్ యూనియన్ ప్రధాన కార్యాలయాన్ని శనివారం ఆరంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టౌన్ బ్యాంక్ చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, అతిథులుగా కార్పొరేటర్ పుల్లూరు అమరనాథరెడ్డి, వైఎస్ఆర్ సీపీ నేతలు సి.రమేష్, హరికృష్ణ, నరేష్, ధరిణీ హాజరై ఎండీయూ ఆపరేటర్స్ యూనియన్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎండీయూ ఆపరేటర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కుడిచేటి కిషోర్‌కుమార్, గౌరవాధ్యక్షుడు ఆర్.సూర్య నారాయణ, ఉపాధ్యక్షుడు ఎస్.రవికుమార్, కోశాధికారి సి.సాంబశివరావు, జిల్లా అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, వెంకట్ రామాంజినేయులు, రాజశేఖర్‌రెడ్డి, వేణు, రాధాక్రిష్ణ, కుమార్, కాజా, మహిదీన్, ఆదిశేషువు, ప్రసాద్, ఏడు కొండలు, రాకేష్, చిన్నారెడ్డి, అశోక్, జిల్లాలోని ఎండీయూలు పాల్గొన్నారు.

రగ్బీ పోటీలకు ఎంపిక

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక జెడ్పీ హైస్కూల్ విద్యార్థి భరత్ రగ్బీ జాతీయ పోటీలకు ఎంపికై నట్లు ప్రధానోపాధ్యాయుడు రమణయ్య తెలిపారు. అదే విధంగా రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు శీను, యామిని, మునిలక్ష్మి, అనిత, అశ్విని ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

భక్తులకు అన్నదానం

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): శ్రీకాళహస్తి మండలం తొండమానుపురంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరాలయంలో శనివారం రాత్రి భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక శివకృష్ణ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో వ్యవస్థాపకులు చంద్రమోహన్‌రెడ్డి భక్తులకు అన్న ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఆలయ సిబ్బంది, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

వ్యర్థ మొక్కల తొలగింపు

నారాయణవనం: మండలంలోని ప్రఖ్యాత పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రమైన కైలాసనాథకోనలో వ్యర్థ మొక్కలను తొలగిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ సుబ్రమణ్యం యాదవ్ పేర్కొన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ వర్షాలకు జాతీయ రహదారి నుంచి కైలాసనాథకోన జలపాతం వరకు రోడ్డుకు ఇరువైపులా మొక్కలు పెరిగిపోవడంతో వాహనదారులకు, పాదచారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. కార్తీక, ధనుర్మాసాలలో కోనకు అధిక సంఖ్యలో భక్తులు వస్తుంటారని తెలిపారు. పర్యాటకులు, భక్తులకు ఇబ్బందులు లేకుండా దారి పొడవునా, జలపాత సమీపంలో మొక్కలను జేసీబీ సాయంతో తొలగిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు,

నేడు రాజ్యాంగ దినోత్సవం

పిచ్చాటూరు: భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పార్టీ శ్రేణులు ఆదివారం పండుగలా జరపాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపునిచ్చారు. శనివారం మధ్యాహ్నం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల కేంద్రాల్లోని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించాలన్నారు.

పాస్టర్ భౌతికకాయానికి నివాళి

మండలంలోని నీరువాయికి చెందిన పాస్టర్ కుమార్ శ్వాశకోస వ్యాధితో శనివారం ఉదయం మరణించారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే ఆదిమూలం మధ్యాహ్నం ఆయన ఇంటికి చేరుకొని, కుమార్ భౌతిక కాయానికి నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

లింగ వివక్షను తరిమికొడదాం



ర్యాలీలో మాట్లాడుతున్న ఏవో గుణశేఖర్

నారాయణవనం: లింగ వివక్షను తరిమికొట్టాలని పలువురు పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో జాతీయ లింగ వివక్ష నిర్మూలనా దినోత్సవాన్ని నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళలు లింగ వివక్ష, హింసకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ ఏవో గుణశేఖర్ మాట్లాడుతూ అన్ని రంగాలలో పురుషులతో సమానంగా రాణిస్తున్న మహిళలను గౌరవించి, గుర్తింపు ఇవ్వడం ప్రతి ఒక్కరికి బాధ్యతని తెలిపారు. ఏపీఎం మమత మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా పరిపుష్టిని సాధించడానికి గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ పనిచేస్తోందన్నారు. స్వయం ఉపాధికి బ్యాంకుల ద్వారా వడ్డీలేని రుణాలను మహిళా సంఘాలకు అందిస్తున్నట్లు తెలిపారు. జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు కోనేటి సుమన్‌కుమార్, కో ఆప్షన్ సభ్యుడు మణిరెడ్డి, ఎంఈవో గోవిందస్వామి, ఏపీవో సుకన్య, పంచాయతీ కార్యదర్శి షణ్ముగం, సీసీ నాగేంద్ర, సంఘమిత్రలు, డ్వాక్రా మహిళా సంఘాల సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బంగారు తిరుచ్చిపై కల్యాణ వెంకన్న

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారు శనివారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై భక్తులకు సాక్షాత్కారించారు. వారపు ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలను నిర్వహించారు. అనంతరం స్వామివారికి అభిషేక సేవను నిర్వహించి వజ్రవైఢూర్యాలు, మరకత మాణిక్యాలతో శోభాయమానంగా అలంకరించి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. తదుపరి స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లను కల్యాణ మండపానికి వేంచేపు చేసి వైఖానస ఆగమోక్తంగా కల్యాణోత్సవాన్ని కనుల పండుగా నిర్వహించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో విద్యుత్ కాంతుల నడుమ స్వామి, అమ్మవార్లకు ఊంజల్ సేవను చేపట్టారు. సర్వాలంకర శోభితుడైన శ్రీనివాసుడు, అమ్మవార్లతో కలసి బంగారు తిరుచ్చి వాహనంపై ఆశీనులై నాలుగు మాడవీధులలో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మీ, ఏఈఓ గోపీనాథ్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి, అర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, జమేదారు చిరంజీవి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



బంగారు తిరుచ్చిపై స్వామి, అమ్మవార్లు

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు ఎన్‌బీఏ గుర్తింపు

- కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఎస్. సుకుమార్



చంద్రగిరి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల

చంద్రగిరి: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు అరుదైన గుర్తింపు లభించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎంఎస్ సుకుమార్ తెలిపారు. దేశంలోనే ప్రతిష్టాత్మకమైన నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ (ఎన్‌బీఏ) మూడు విద్యా సంవత్సరాలకు గుర్తింపునిస్తూ ఢిల్లీలోని కార్యాలయం నుండి సమాచారం అందినట్లు ఆయన తెలిపారు. అక్టోబర్ 13 నుండి 15 వరకు ఎన్‌బీఏ జాతీయ బృందం మూడు రోజులపాటు కళాశాలలో తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో అర్హత, అనుభవం, అంకితభావం కలిగిన విద్యార్థులు ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌లో కనబరిచిన ప్రతిభను పరిశీలించారన్నారు. అంతేకాకుండా కళాశాలలోని మౌలిక సదుపాయాలను పరిగణనలోకి తీసుకుని ఈ గుర్తింపునిచ్చినట్లు తెలిపారు. ఈ గుర్తింపు కోసం సహకరించిన రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ డైరెక్టర్ సి. నాగరాణి, ఆర్జేడీ ఏ నిర్మల్ కుమార్ ప్రియా, అకడమిక్ డిప్యూటీ డైరెక్టర్ విజయ భాస్కర్, కార్యదర్శి కె.వి.రమణ బాబులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా ఎన్‌బీఏ కోఆర్డినేటర్లు వి.ఫణికుమార్, ఎం.రమ్య, విభాగాధిపతులు డాక్టర్ పి.నాగేంద్ర, డాక్టర్ పి.భక్తవత్సలంకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. తమ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ శాఖలకు, శాస్త్ర సాంకేతిక, విద్య, సామాజిక, సాంస్కృతిక, సేవా రంగాలలో విద్యార్థులు కనభరిచిన ప్రతిభకు దక్కిన గుర్తింపుగా భావించడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ఎన్‌బీఏ గుర్తింపు దోహదపడుతుందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు.

కిసాన్ డ్రోన్లపై రైతులకు అవగాహన



రైతులకు కిసాన్ డ్రోన్లపై అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

రామచంద్రాపురం: కిసాన్ డ్రోన్లపై రైతులకు అవగాహన అవసరమని జిల్లా వ్యవసాయాధికారి ప్రసాద్‌రావు అన్నారు. శనివారం మండలంలోని సొరకాయలపాలెంలో నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కిసాన్ డ్రోన్ల పనితీరు, దాని ఉపయోగాలను రైతులకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికే వివిధ యంత్రాల పనిముట్లను రైతులకు రాయితీపై అందిస్తోందన్నారు. తాజాగా పంటలకు పురుగు మందులను పిచికారీ చేయడానికి కిసాన్ డ్రోన్లను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు. వీటిని రైతులు రాయితీపై పొందవచ్చన్నారు. రైతులు మరిన్ని వివరాలకు తమ గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాలను సంప్రదించాలని సూచించారు. మండల వ్యవసాయాధికారి స్రవంతి, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం వేడుకలు



ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు

పాకాల: మండలంలోని మొగరాల జెడ్పీ హైస్కూల్‌లో భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం పాఠశాల హెచ్‌ఎం సుమలత అధ్యక్షతన ఈ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ డీసీ గణిత ఉపాధ్యాయుడు రామయ్య మాట్లాడుతూ రాజ్యాంగం, అందులోని విద్య, ఉద్యోగం, ఉపాధి, ఆరోగ్యం, రక్షణ వంటి అంశాలను విద్యార్థులకు వివరించారు. అలాగే విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి జోహార్లు అర్పించారు. ఉపాధ్యాయులు రామమూర్తి, ప్రబోధిని, దేవిక, బాలరాజు, బాలాజీ, జయచంద్ర, గణపతి, ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి



చుక్కల దుప్పిని వేటాడుతున్న కుక్కలు



కుక్కల దాడిలో మృతి చెందిన దుప్పి

- సకాలంలో స్పందించని అటవీ అధికారులు

చంద్రగిరి: కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి చెందిన ఘటన శనివారం మండల పరిధిలోని పనపాకం పంచాయతీ గడ్డంవారిపల్లి సమీపంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల వివరాల మేరకు.. శనివారం ఉదయం 8 గంటల సమయంలో సమీప అటవీ ప్రాంతం నుంచి చుక్కల దుప్పి దారితప్పిపోయి పంట పొలాల వైపు వచ్చింది. దుప్పి రాకను పసిగట్టిన కుక్కలు తరుముకుంటూ వేటాడి దాడికి పాల్పడ్డాయి. దీంతో దుప్పి మెడ వద్ద బలమైన రక్తగాయం కావడంతో అక్కడే కుప్పకూలింది. ఉదయం 9 గంటల సమయంలో కుక్కల దాడిలో గాయపడిన దుప్పిని గమనించిన గ్రామస్తులు రక్షించి, అటవీ అధికారులకు సమాచారం అందించారు. అయితే అటవీ అధికారులు తీరిగ్గా మధ్యాహ్నం 12 గంటలకు గాయపడిన దుప్పి వద్దకు చేరుకున్నారు. దుప్పిని పరీక్షించిన అధికారులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. అనంతరం దుప్పి కళేబరానికి పంచనామా నిర్వహించి, అడవి సమీపంలో దహనం చేశారు. సకాలంలో అటవీ అధికారులు స్పందించి, గాయపడిన దుప్పికి వైద్య సేవలను అందించి ఉంటే ప్రాణాలతో బతికుండేదని, అధికారుల నిర్లక్ష్యం కారణంగా దుప్పి మృతి చెందినట్లు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యే వివాహ కానుక పంపిణీ



నూతన వధువు కుటుంబ సభ్యులకు పెళ్లికానుకను అందిస్తున్న నాయకులు

చంద్రగిరి: ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పంపిన ఎమ్మెల్యే వివాహ కానుకను ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి వధూవరులకు అందజేశారు. శనివారం మండల పరిధిలోని మిట్టపాళెం పంచాయతీ సత్యసాయి బీసీ కాలనీకు చెందిన దివ్య, వాసుదేవ రామన్, అదే విధంగా బుచ్చినాయుడుపల్లి పంచాయతీ దళితవాడకు చెందిన చెంగమ్మ, మణికంఠలకు వివాహం నిశ్చయమైంది. ఈ సందర్భంగా తొండవాడ డివిజన్ వైఎస్ఆర్ సీపీ అధ్యక్షుడు పసల నాగరాజు ఆధ్వర్యంలో ఆయన నూతన వధూవరులకు ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పంపించిన బంగారు తాళిబొట్టు, పట్టువస్త్రాలు, శ్రీవారి లడ్డూ-వడ, అమ్మవారి పసుపు-కుంకుమ, వెండి మెట్టెలతో కూడిన కానుకలను అందజేశారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి-2 ఎంపీటీసీ మాధవరెడ్డితో పాటు ఇతర నాయకులు పాల్గొన్నారు.

కార్తీక మాసంలో
తిరునక్షత్రోత్సవాలు

తిరుమల: పవిత్రమైన కార్తీక మాసం శివకేశవులకు ఎంతో ప్రీతికరమైనది. ఈ మాసంలో భగవంతుని ఆరాధనతోపాటు దానధర్మాలు చేస్తే రెట్టింపు ఫలితం లభిస్తుందని పండితులు చెబుతున్నారు. అయితే ఈ మాసంలో పలువురు భక్తాగ్రేసరుల తిరునక్షత్రోత్సవాలు ఉండడం విశేషం. నవంబరు 14న శ్రీ తిరుమలనంబి శాత్తుమొర జరిగింది. శ్రీవారి భక్తాగ్రేసరులలో ఒకరైన శ్రీ తిరుమలనంబి శ్రీవేంకటేశ్వరస్వామివారికి తీర్థ కైంకర్యం ప్రారంభించారు. వీరు భగవద్రామానుజుల వారికి స్వయాన మేనమామ, గురుతుల్యులు. వీరు రామానుజుల వారికి రామాయణ పఠనం చేశారని పురాణాల ద్వారా తెలుస్తోంది. నవంబరు 16న శ్రీ మనవాళ మహాముని శాత్తుమొర నిర్వహించారు. శ్రీమనవాళ మహాముని ఒక హిందూ వేదాంతవేత్త. వీరు 15వ శతాబ్దంలో తమిళంలో శ్రీ వైష్ణవ సంప్రదాయాన్ని ప్రధానంగా ప్రతిపాదించారు. విశిష్టాద్వైత తత్వాన్ని విస్తృతంగా ప్రచారం చేశారు. నవంబరు 19న శ్రీఅత్రి మహర్షి వార్షిక తిరునక్షత్రోత్సవం జరిగింది. సప్తర్షి నక్షత్ర మండలంలో అత్రి ఒకరు. వీరి గౌరవార్థం రుగ్వేదంలోని ఐదో మండలాన్ని అత్రి మండలం అని పిలుస్తారు. నవంబరు 22న శ్రీ యాజ్ఞవల్క్యుని జయంతి జరిగింది. శ్రీయాజ్ఞవల్క్యుడు ప్రాచీన వేద భారతావనిలో ప్రముఖుడు. ఉపనిషత్తుల్లో ముఖ్యంగా కనిపించే శ్రీయాజ్ఞవల్క్యుడు శతపథ బ్రాహ్మణం(బృహదారణ్యకోపనిషత్తు) సహా యాజ్ఞవల్క్య సంహిత, యాజ్ఞవల్క్య స్మృతి రచించారు. నవంబరు 27న శ్రీ తిరుమంగై ఆళ్వార్ శాత్తుమొర జరుగనుంది. శ్రీతిరుమంగై ఆళ్వార్ దక్షిణ భారతదేశంలోని 12 మంది ఆళ్వారులలో చివరివాడు. వీరు శ్రీవైష్ణవ సంప్రదాయంలో శ్రీవేంకటేశ్వరస్వామివారిని కీర్తిస్తూ పాశురాలు రచించారు. వీరిని పరకాలయోగి అని కూడా పిలుస్తారు. నవంబరు 28న శ్రీ తిరుప్పాణాళ్వార్ వర్ష తిరునక్షత్రోత్సవం జరుగనుంది. 12 మంది ఆళ్వారులలో 11వ వాడు శ్రీ తిరుప్పాణాళ్వార్. వీరు ఆళ్వార్ల పాశురాలను నాలాయిర దివ్య ప్రబంధంగా సంకలనం చేశారు.

దామలచెరువులో వికసిత్ భారత్ యాత్ర

పాకాల: మండలంలోని దామలచెరువు, పేరసానిపల్లి పంచాయతీల్లో వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. శనివారం ఈ కార్యక్రమాల్లో ఈఓపీఆర్డీ మాలతి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 17 రకాల సంక్షేమ పథకాలను వివరించారు. ముఖ్యంగా పీఎం విశ్వకర్మ, ఆవాస యోజన, ఆయుష్మాన్ భారత్, పీఎం కిసాన్ వంటి సంక్షేమ పథకాలు, వాటితో కలిగే ప్రయోజనాలను వివరించారు. అలాగే లబ్ధిదారుల వివరాలను కూడా తెలిపారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్‌లు సునీత, శాంత, వైస్ ఎంపీపీ నాగూర్‌బి, ఎంపీటీసీలు గౌతమి, మల్లికార్జున, ఏఓ కరుణాకర్‌రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి పుష్పావతి, ఎంఈఓ బాబ్జీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృష్ణవేణి, పీఎస్‌లు మేనక, ఢిల్లీబాబు తదితరులు పాల్గొన్నారు.